క్లుప్తంగా

8న ఆలయ భూములకు కౌలువేలం

కడియం: స్థానిక దుర్గామల్లేశ్వరస్వామివారి ఆలయ భూములకు ఈ నెల 8వ తేదీ ఉదయం కౌలు వేలం జరుగుతుందని దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు తెలిపారు. 9.92 ఎకరాలకు సంబంధించి ఈ వేలంలో నిబంధనల మేరకు పాల్గొనవచ్చన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కడియం జనార్దనస్వామి ఆలయం వద్ద స్వామి వారికి చెందిన 14.84 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆ జీవోలను వెంటనే రద్దు చేయాలి

కంబాలచెరువు: విద్యావ్యవస్థకు ఇబ్బందికరంగా ఉన్న జీవోలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. స్థానిక నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ జీవోలు 84, 60, 117 లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వేద పాఠశాల పునఃప్రారంభం



వేద పాఠశాలను పునఃప్రారంభిస్తున్న దేవదాయశాఖ ఉప కమిషనర్ విజయరాజు

ధవళేశ్వరం: గ్రామంలోని రామపాదాలరేవు వద్ద చల్లా బ్రహ్మయ్య శాస్త్రి వేద పాఠశాలను సోమవారం దేవదాయశాఖ ఉప కమిషనర్ మేడేపల్లి విజయరాజు పునఃప్రారంభించారు. ఈ పాఠశాలను 1884లో స్థాపించగా కాలక్రమంలో మూతబడింది. దేవదాయశాఖ ఉప కమిషనర్ మేడేపల్లి విజయరాజు చొరవతో తిరిగి ప్రారంభోత్సవానికి నోచుకుంది. ఈ సందర్భంగా గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్య నాగ వరప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి వెంకట కవులు ఈ పాఠశాల విద్యార్థులేనన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో కె.నాగ సురేష్, యర్రమోతు ధర్మరాజు, మంగళంపల్లి చంద్రశేఖర్, మహేష్, ఒంటెద్దు స్వామి పాల్గొన్నారు.

28 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు స్పందన స్థానంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుట్టిందని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 28 అర్జీలను స్వీకరించారు. మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: గురుపౌర్ణమి (జూలై 21)ని పురస్కరించుకుని పలు రంగాలలో శిక్షణ ఇస్తున్న వారికి గురుబ్రహ్మ, గురుశిరోమణి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు సర్వేజనా సుఖినోభవంతు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి, సమాజ వికాసానికి, విద్య, యోగా, ఆధ్యాత్మిక, ధార్మిక, వైద్యం, సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే తదితర రంగాలలో సేవలు అందిస్తున్న గురువులకు వీటిని అందజేస్తామన్నారు. ఆసక్తి కలవారు తమ దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోపు సర్వేజనా సుఖినో భవంతు, డోర్ నంబర్ 1–20–164, పోస్టు, తిరుమలగిరి, గోకుల్ నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్–15 అనే చిరునామాకు పంపాలన్నారు. అలాగే తమ సేవల, ప్రతిభను తెలియజేసేలా సర్టిఫికెట్లు, పత్రికలలో వచ్చిన వార్త క్లిప్పింగ్‌లను వాటికి జతచేయాలన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

కడియం: వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. జూలై నుంచి రెండు నెలల పాటు జరగనున్న డయేరియా నియంత్రణ మాసోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, సర్పంచ్‌లు మోసిగంటి సత్యవతి, అన్నందేవుల చంటి, ముద్రగడ జెమ్మీ, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, ఎంపీడీవో రాజ్‌మనోజ్, వైద్యాధికారులు జెస్సీసుప్రియ, మణిజ్యోత్స్న, జి.స్వరూప పాల్గొన్నారు.

కోటి లింగాల తయారీ

మధురపూడి: స్థానిక హరేరామ నగర్‌లో కోటి మట్టి లింగాల తయారీ ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. స్థానిక మహిళలు, పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చాలా లింగాలను తయారు చేశారు. వీటిని కాశీ తీసుకువెళ్లి అభిషేకం చేయనున్నారు.

అంతా వారిష్టమే..

- ప్రభుత్వాసుపత్రి జనరేటర్ విద్యుత్ ప్రైవేట్ పరం
- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ప్రవర్తిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించినా ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు. ముఖ్యంగా ఆసుపత్రికి చెందిన వనరులు ప్రైవేట్ పరం అవుతున్నాయి. దీనిపై పలువురు గగ్గోలు పెడుతున్నారు. మూలిగే నక్కమీద తాటికాయ పడినట్టు అసలే కరెంటు బిల్లులు చెల్లించడంలో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాసుపత్రి జనరేటర్ కనెక్షన్‌ను ఆ ప్రాంతంలో ఉన్న హోటల్‌కు అందించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో రోగుల సౌకర్యార్థం హోటల్, కాఫీ హౌస్, స్టేషనరీ, జిరాక్స్, దుకాణాలు ఏర్పాటు చేసే దిశగా టెండర్ వేశారు. రోగులు చికిత్స కోసం వచ్చినప్పుడు ఆధార్ వంటి పత్రాలు అవసరమైతే, వాటి కోసం దూరంగా వెళ్లే అవసరం లేకుండా వీటికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆ టెండర్‌లో ఒకే వ్యక్తి ఆ నాలుగు దుకాణాలను సొంతం చేసుకుని, మొత్తం ఆ ప్రాంగణమంతా ఒక హోటల్‌ను మాత్రమే నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం నాలుగు వేర్వేరు దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి

నాలుగు దుకాణాలు ఒకే వ్యక్తి పాడుకోవడంతో జిరాక్స్ దుకాణంతో పాటు మిగతా దుకాణాలు అటకెక్కాయి. జిరాక్స్‌తో మిగిలిన వాటికోసం రోగులకు బయటకు వెళుతున్నారు. స్టేషనరీ లేదు, జిరాక్స్ లేదని సూపరింటెండెంట్ సూర్యప్రభ ఇటీవల హోటల్ నిర్వాహకులను నిలదీస్తే సరైన సమాధానం రాలేదని ఆమె తెలిపారు.

ఆ బిల్లులు ఎవరు చెల్లిస్తారు?

ప్రభుత్వాస్పత్రిలో ఎమ్ఆర్ఐ సేవలు ఒక ప్రైవేట్ సంస్థ అందిస్తోంది. అయితే ఎమ్ఆర్ఐ స్కాన్‌కు ఆసుపత్రి వర్గాలు ప్రత్యేక మీటర్ బిగించాల్సివుంది. దాన్ని పెట్టకపోవడంతో ఆ విద్యుత్ భారం ఆసుపత్రి పైనే పడింది. గత మూడేళ్లుగా ఎమ్ఆర్ఐ స్కాన్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో సుమారు రూ.2 కోట్ల వరకూ ఆ మొత్తం పెరిగింది. ఈ భారం ప్రభుత్వాస్పత్రే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బిల్లును ఆ సంస్థ నిర్వాహకులు చెల్లిస్తారా, లేదా అనేది ప్రశ్నార్థకమే.

వెంటనే చర్యలు చేపడతాం



ప్రభుత్వాసుపత్రిలోని హోటల్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే చర్యలు చేపడతాం. హోటల్‌కు ఉన్న జనరేటర్ కనెక్షన్ తొలగించాలని సిబ్బందికి చెప్పాం. ఇంకా తొలగించకపోతే వెంటనే చర్యలు తీసుకుంటాం. అలాగే ఆసుపత్రిలోని ఎమ్ఆర్ఐ స్కాన్, డయాలసిస్ యూనిట్‌లకు వచ్చే విద్యుత్ బిల్లులపై మాట్లాడతాం. విద్యుత్ బిల్లులు బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపడతాం.

– డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

చట్టాలపై అవగాహన అవసరం

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ఇన్‌క్లూజివ్ సెంటర్ ద్వారా సోమవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరపూరిత చర్యలు బాలికలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. వాటిని అధిగమించడానికి అవసరమైన చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళా పోలీస్ విభాగం డీఎస్పీ బి.ఆదినారాయణ మాట్లాడుతూ డ్రగ్స్, సామాజిక మాధ్యమాలలో నేరపూరిత సంఘటనలు, ఫొటో మార్ఫింగ్ తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం చక్కటి ఆహారం తీసుకోవాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. ఎస్సై అమీనాబేగం మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమార్, అధ్యాపకులు డాక్టర్ కె.నీరజ, రమాదేవి, వీబీటీ సుందరి, ఎం.శ్రీదేవి, కె.కుసుమ కామేశ్వరి, ప్రసన్న పాల్గొన్నారు.

ఫ్రీ సీట్ల కేటాయింపు జీవో అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించేందుకు తీసుకువచ్చిన జీవోను అమలు చేయాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు, సెక్రటరీ సుధీర్ బాబు, ట్రెజర్ దేవి, వైస్ ప్రెసిడెంట్ ఎ.నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. కొమ్ము సత్తిబాబు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవోను తీసుకువచ్చిందన్నారు. అయితే కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు దీనిని తుంగలోకి తొక్కి, ఫీజులు కట్టించుకుంటున్నాయని ఆరోపించారు. దీనిపై డీఈఓ, ఎంఈఓ, ఇతర విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్య చట్టాన్ని అమలు చేయని గాడాల లోని లారెన్స్ ఇంటర్నేషనల్, టిప్స్ ఇంటర్నేషనల్, బొమ్మూరులోని భాష్యం, శ్రీ చైతన్య, భారతీ విద్యా భవన్, మోరంపూడి లోని షిరిడీ సాయి, ఫ్యూచర్ కిడ్స్ స్కూళ్లపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అలాగే ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి కూడా తీసుకు వెళ్లామన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ దుర్గా భాస్కర్, తేజస్విని, పి.శ్రీనివాస్, పి.రవికుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు సమష్టి కృషి



మొక్క నాటుతున్న ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం ప్రమోద్ కుమార్ మిశ్రా అన్నారు. ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ గెస్ట్ హౌస్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం శ్రీధర్, సేవా డీజీఎస్ యశ్వంత్, సీఆర్ఎస్ శేషుకుమార్, డీఆర్ఎస్ గాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన విద్యార్థులు



విద్యార్థులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతున్న ఇద్దరు విద్యార్థులను జీఆర్పీ పోలీసులు గుర్తించి, వారి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి తిరుగుతున్న ఇద్దరు విద్యార్థులను జీఆర్పీ పోలీసులు గమనించారు. వారిని వెంటనే స్టేషన్‌కు తీసుకుని వెళ్లి ప్రశ్నించారు. వారిని కాకినాడకు చెందిన సంగడి అర్జున్, గంట ఏసురాజుగా గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. విద్యార్థులిద్దరూ కాకినాడ బాలుర హాస్టల్ నుంచి పారిపోయి రావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమక్షంలో వారిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు మావుళ్లు, లోవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ బీసీ రాయ్ సేవలు స్ఫూర్తిదాయకం



వైద్యులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కంబాలచెరువు: డాక్టర్ బీసీ రాయ్ పేదలకు అందించిన సేవలే నేటి వైద్యులకు స్ఫూర్తిదాయకమని సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎంయూ భాస్కరరావు అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ది పీఎంపీ అసోసియేషన్) జిల్లా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీసు కన్వెన్షన్ సెంటర్ హాలులో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జాతీయ వైద్యుల దినోత్సవం, వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కరరావు మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ వైద్య వృత్తిలో ఎన్నో కీలకమైన సంస్కరణలు చేశారని, ఆయన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం భారతరత్నతో గౌరవించిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఎమ్వీఆర్ మూర్తి మాట్లాడుతూ వైద్యులను గౌరవించుకోవడమే వైద్యుల దినోత్సవమన్నారు. లక్ష్మీ ఫెర్టిలిటీ సెంటర్ వైద్యులు డాక్టర్ వి.ప్రదీప్తి కరుణ, డాక్టర్ వీఎస్ఎల్ ప్రసన్న, డాక్టర్ ఎం.సుమలత, డాక్టర్ సి.సుధాకర్, ఎం.శ్రీధర్ నాయుడు, డాక్టర్ వాడపల్లి సతీష్ తదితరులు వైద్య విజ్ఞానం ద్వారా ఫెర్టిలిటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు, ఉపాధ్యక్షుడు రహమాన్ ఖాన్, సహాయ కార్యదర్శి ఎ. ధనుంజయరావు పాల్గొన్నారు.

బురదకాలువ ముంపుతో అవస్థలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని పలు ప్రాంతాలు సోమవారం బురద కాలువ నీటి కారణంగా ముంపునకు గురయ్యాయి. గ్రామంలోని పందుల్లమ్మ దేవాలయం సమీప ప్రాంతం, రాఘవపురం నుంచి వచ్చే రోడ్డులోని బీసీ పేటలలో మోకాలు లోతు నీరు నిలిచింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బురద కాలువ నుంచి నీరు నివాస ప్రాంతాలకు చేరింది. సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు ఏర్పడుతున్న ఈ ముంపు సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 20 ఏళ్లుగా ఈ సమస్య నెలకొంది. కాగా.. కోరుకొండ తహసీల్దార్ రాజలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని ముంపు బాధితులతో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.



బురదకాలువ నీటితో ముంపు బారిన పడిన శ్రీరంగపట్నం బీసీ కాలనీ

నేడు సుభద్రమ్మ అంత్యక్రియలు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాతృమూర్తి సుభద్రమ్మ అంత్యక్రియలు మంగళవారం ఉదయం 10 గంటలకు కోటిలింగాలఘాట్‌లో జరగనున్నాయి. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రూరల్ పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. కాగా.. రామచంద్రపురంలోని వేణు స్వగృహంలో సుభద్రమ్మ భౌతికకాయాన్ని సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ నాయకులు గిరజాల బాబు, అంగాడి సత్యప్రియ, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సాధనాల శివ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మంత్రి వేణుగోపాలకృష్ణను పరామర్శించారు.

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకరరావు

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై బొమ్మూరు కూడలిలో విద్యుద్దీపాలు లేక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తూర్పురేఖ ఆర్‌టీఐ వ్యాప్తి వేదిక కన్వీనర్ దివిలి ప్రభాకరరావు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ వైకేవీ అప్పారావుకు సోమవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. బొమ్మూరు జాతీయ రహదారి మీదుగా రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారని, రాత్రి సమయంలో విద్యుద్దీపాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ అప్పారావు తెలిపారు.

అదుపు తప్పిన ట్రాలీ



అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కిన ట్రాలీ

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువులోని జీరో పాయింట్ వద్ద సోమవారం రాత్రి ఓ ట్రాలీ అదుపు తప్పి డివైడర్ మీదుకు దూసుకుపోయింది. ముందుకు కదలకుండా అక్కడే ఉండిపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ట్రాలీ రైలు చక్రాలు లోడుతో బెంగళూరు నుంచి పశ్చిమ బెంగాల్ వెళుతోంది.

ఈ–కేవైసీ తప్పనిసరి

మధురపూడి: సొసైటీ పరిధిలోని సభ్యులందరూ ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని కోరుకొండ మండలం గాడాల వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈఓ ఉండమట్ల ఏడుకొండల బాబు కోరారు. మండలంలోని గాడాల, మధురపూడి, నిడిగట్ల, పాలచర్ల గ్రామాలకు చెందిన సభ్యులు ఆధార్ కార్డు, పాన్ నంబరు, రెండు పాస్‌పోర్టు ఫొటోలను తీసుకొచ్చి, సభ్యత్వాన్ని ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సొసైటీల్లో చేపట్టిన కంప్యూటరైజేషన్‌లో భాగంగా సభ్యులు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. సొసైటీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు.

సీతానగరం: రాపాక, రఘుదేవపురం, ముగ్గళ్ల, సీతానగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని సభ్యులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈవోలు లక్ష్మణరావు, కాట్నం వెంకటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, కాట్నం గణేష్ కోరారు.

మకర తోరణం సమర్పణ

రంగంపేట: చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి స్వామికి గ్రామానికి చెందిన భక్తులు నామాల దొరబాబు, నాయుడు అమ్మిరాజు రూ.3,500 విలువైన మకర తోరణం సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి నూతన మకరతోరణం అలంకరించారు.

అంకితభావంతోనే ఉద్యోగికి గుర్తింపు



పాండురంగారావును సన్మానిస్తున్న బీఎం రమేష్ రెడ్డి తదితరులు

రాజానగరం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, అయితే విధి నిర్వహణలో చూపించిన అంకిత భావమే అతడికి మరింత పేరు తీసుకువస్తుందని సాక్షి రాజమహేంద్రవరం యూనిట్ బ్రాంచ్ మేనేజర్ రమేష్‌రెడ్డి అన్నారు. సాక్షి యూనిట్‌లో సర్క్యులేషన్ విభాగంలో సుదీర్ఘ కాలం సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన విశాల వెంకట నాగ పాండురంగారావును యూనిట్ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సహోద్యోగులు గుర్తుచేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ప్రకటనల విభాగం) వీజీఎస్ఎన్ మూర్తి, సత్య ప్రసాద్ (అకౌంట్స్), స్టోర్స్ ఇన్‌చార్జి రామారావు, ఐటీ ఇన్‌చార్జి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ గోతులు పూడ్చకపోతే మళ్లీ ఉద్యమం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: ప్రమాదకరంగా మారిన క్వారీ గోతులను నెల రోజుల్లో పూడ్చకపోతే మళ్లీ ప్రజా ఉద్యమం చేపడతామని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే క్వారీ గోతుల్లో నీటిని తోడించి, మట్టితో పూడ్చేలా యజమానులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో తాను చేసిన పోరాటం ఫలితంగా ఏడు ఎకరాలు పూడ్చారని, ఇంకా 25 ఎకరాల్లో గోతులు అలాగే ఉన్నాయన్నారు. ఈ సమస్యను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళతానన్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, దీని బాధ్యతగా భావించి క్వారీ గోతులు పూడ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో సున్నంబట్టి లేఅవుట్ కమిటీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి టి.బాబూరావు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం



సత్యనారాయణను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ శాఖలో 32 ఏళ్లు సుదీర్ఘ సేవలు అందించిన సత్యనారాయణను ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. పదవీ విరమణ చేసిన వ్యవసాయ శాఖ వాచ్‌మెన్ నేదునూరి సత్యనారాయణకు నగరంలోని ఏవీ రోడ్డులోని ఒక హోటల్లో సోమవారం అభినందన సభ జరిగింది. సత్యనారాయణ సమయపాలనను కచ్చితంగా పాటించేవారని, నిజాయితీగా విధులు నిర్వర్తించారని వక్తలు కొనియాడారు. రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వేణుమాధవ్, విశ్రాంత డీడీఏ ఎస్.లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారులు భీమరాజు, శాంతా ఆలీవ్, రమేష్,సరళ, శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



బొమ్మూరులో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. హుకుంపేట డిబ్లాకు, శాటిలైట్ సిటీ, బొమ్మూరు గ్రామాలలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా.. రూరల్ మండలంలో 19,861 మంది లబ్ధిదారులకు రూ.13.58 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో 18,083 మందికి 13.58 కోట్లను (91 శాతం) పంపిణీ చేశామని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తెలిపారు.

కడియం: ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పెన్షన్లను పంపిణీ చేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు ఆయా పార్టీల కండువాలు, జెండాలతో పంపిణీలో పాల్గొన్నారు. వేమగిరిలో జేసీ తేజ్‌భరత్ పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు. వేమగిరిలో ఎంపీడీవో రాజ్‌మనోజ్, కడియంలో తహసీల్దార్ రమాదేవి పంపిణీలో పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటల సమయానికి 95 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా నాయకుల రాక ఆలస్యం కావడంతో మాధవరాయుడుపాలెంలో పంపిణీ ఆలస్యంగా మొదలు పెట్టారు.

బోర్ల నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో రూ.3.5 లక్షలతో నిర్మిస్తున్న బోరుకు ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి సోమవారం కొబ్బరికాయ కొట్టారు. హుకుంపేట డి బ్లాకులోని రామాలయం సెంటర్ వద్ద రూ.5 లక్షలతో నిర్మించే బోరుకు శంకుస్థాపన చేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఎంపీపీ మెయిన్ పాఠశాల వద్ద దాతలు విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఉపాధ్యాయుడు సబ్బారపు రమేష్, కర్రి రామకృష్ణారెడ్డిలు విద్యార్థులకు నోటు పుస్తకాలు సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం డి.అప్పారెడ్డి మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్రి వీర్రాఘవరెడ్డి, సోమేశ్వరశర్మ, సుభాషిణి, విజయ తదితరులు పాల్గొన్నారు.



పందలపాకలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దాతలు